ఎండాకాలం.. జర జాగ్రత్త

- మండుతున్న ఎండలు
- వాహనాల్లో ఆవిరి అవుతున్న ఇంధనం
- పార్కింగ్ జోన్లు లేక అవస్థలు
- అవగాహనతోనే బైక్‌లు సురక్షితం

వైరా: ఎండలు రోజు రోజుకూ మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైగా నమోదవుతున్నాయి. ఏప్రిల్‌లోనే ఉదయభానుడి ప్రతాపం ఇలా ఉంటే... రానున్న రెండు నెలల మాటేమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయమే బయటికి రావాలంటే జంకుతున్న పరిస్థితుల్లో యంత్రాల మాటేమిటి? ఎండ వేడిమికి వాహనాలు సహజత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వాహనదారుల జేబులకు చిల్లులు పడే అవకాశం ఉంది.

ఆందోళనలో వాహనదారులు..

బైక్‌లు మొదలు, కార్ల వరకు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే, దెబ్బతింటాయని మెకానిక్‌లు హెచ్చరిస్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ త్వరగా అయిపోతున్న తీరుతో తెగ ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలకు ఉష్ణోగ్రతలు పెరగడం వల్లే ఇలా జరుగుతోందా? నిపుణులు ఈ మాట నిజమే అంటున్నారు. ఎండలో బైక్ నిలిపితే ఎక్కువ శాతం ఇంధనం ఆవిరయ్యే అవకాశం ఉంది. అందువల్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.

పార్కింగ్ జోన్లు లేకే...

మార్కెట్‌కు వెళ్ళే వారు తమ వాహనాలు నిలపడానికి పార్కింగ్ జోన్లు లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎండలోనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి.



వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలు

జిల్లా కేంద్రంతో పాటు మున్సిపాలిటీలుగా మారిన వైరా,మధిర, సత్తుపల్లితో పాటు మండల కేంద్రాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రులు, బస్టాండ్, బజార్, చౌరస్తాల్లో దాదాపుగా పార్కింగ్ జోన్లు లేవు.

జాగ్రత్తలు అవసరం...

వేసవికాలం కావడంతో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే ప్రారంభం అవుతున్న ఉష్ణోగ్రతలు మిట్ట మధ్యాహ్నం గరిష్ఠ స్థాయి చేరుకుంటున్నాయి. ఎండలు ఏప్రిల్, మే మాసాల్లో మరింతగా ముదిరే అవకాశం ఉంటుంది.

- వేసవి కాలంలో ట్యాంక్ నిండుకు పెట్రోల్ నింపకూడదు. ఇలా చేస్తే ఎక్కువ ఆవిరి అవుతుంది. అవసరానికి సరిపడా పట్టుకోవాలి.
- వాహనాలను వీలైనంత వరకు నీడలోనే పార్కింగ్ చేయాలి.
- టైర్లు కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది.
- పెట్రోల్ ట్యాంక్‌పై మందమైన కవర్ ఉండేలా చూసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి..

వేసవికాలం వాహనదారులు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఎండాకాలంలో పెట్రోల్‌ట్యాంక్‌లో గ్యాస్ ఏర్పడే అవకాశం ఉంటుంది. రాత్రి బైక్ పార్క్ చేసేటప్పుడు ఒకసారి ట్యాంక్‌మూత తెరిచి, మళ్ళీ మూయాలి. సీటు కవర్లు వేడి ఎక్కకుండా వెల్‌వెట్, క్లాత్‌సీట్ కవర్లు వేసుకోవాలి. వాహనాన్ని నీడలోనే పార్కు చేయాలి.

– గౌస్, మెకానిక్, వైరా

క్లుప్తంగా

సీతమ్మ పెండ్లి కూతురాయెనే..


సీతమ్మవారిని పెండ్లి కూతురుగా అలంకరించిన దృశ్యం

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో ప్రతి ఏటా శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తుంటారు. భద్రాచలం తరహాలో స్థానిక కోదండ రామాలయంలో నెల రోజుల ముందే పసుపు కొట్టు పెండ్లి పనులు ప్రారంభించి చలువ పందిళ్ల వేసి వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తారు. ఇందులో భాగంగా సోమవారం సీతమ్మవారిని పెండ్లి కూతురుగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కల్లూరులోని చంద్రుపట్ల క్రాస్ రోడ్ వద్ద ఉన్న చలివేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్‌రావు తల్లి భాగం నారాయణమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండ వేడిమి భాగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్‌రావు, మూకర విజయారావు, బైర్ల కాంతారావు, పాపబత్తిని నగేష్, యాసా శ్రీకాంత్, ఎనుముల రాము, మేకల సాంబశివ రావు, ఎండీ షఫి, పొన్నూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పెనుబల్లి: మండల పరిధిలోని వీయంబంజర్ లో పలువురు నాయకులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం పరామర్శించారు. వీయంబంజర్‌కు చెందిన రిటైర్డు సీఐ జన్నారెడ్డి నరసింహారెడ్డి భార్య విజయ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమెను పరామర్శించి ఆమె ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వంగా సుబ్బారావును, ఆయన భార్య వంగా శారదమ్మలను కలుసుకొని వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌కె టీ కేఫ్ షాపును నాయకులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మేకతొట్టి కాంతయ్య, బుక్కా కృష్ణవేణి, దొంతు మాధవరావు, మిట్టపల్లి కిరణ్‌కుమార్, మల్లెల రాజా, ఎస్‌కె బాజీ, బొర్రా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ


ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెనుబల్లి: మండలంలోని లంకపల్లి సెక్టార్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసిన సంగా లక్ష్మీకాంతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం అంగన్‌వాడీ టీచర్లు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయ, నవీన, అంగన్‌వాడీ టీచర్లు రాణి, విజయకుమారి, రాధిక, శిరోమణి, స్వరూపరాణి, వరలక్ష్మి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్


పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలింది. పగిలి నెలరోజులైనా సంబంధిత అధికారులు పట్టిపట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో చుట్టుపక్కల నీరు చేరి మురికిగా మారుతుంది. ఈ క్రమంలో నీటి సరఫరా జరిగితే ప్రజలు వ్యాధులు భారీన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పగిలిన పైపులైనుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బస్ సర్వీస్ పొడిగించండి


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న ప్రయాణికులు

సత్తుపల్లి: ఆర్టీసీ డిపో నుంచి 8858 హైదరాబాద్ సర్వీస్‌ను బీహెచ్‌ఇఎల్ వరకు పొడిగించాలని గౌరిగూడెం, సిద్దారం, సదాశివునిపేట ప్రయాణికులు సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. మర్లపాడు, భీమవరం, సదాశివునిపేట, సిద్దారం, గౌరిగూడెం మీదగా సూపర్ లగ్జరి సర్వీస్ నడిపేందుకు నిర్ణయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏరువా వినోద్‌రెడ్డి, బండి గణేష్ రెడ్డి, కేశవరెడ్డి, సతీష్, శివ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ..

సత్తుపల్లి బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎం రాజ్యలక్ష్మి ప్రారంభించి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీబీఓ ఆనంద్, ఐ రాధాకృష్ణ, శ్రీనివాసరావు, గుంశావళి, రవి, సాంబ, సుధాకర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

తల్లాడ: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధిస్తుందని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. సోమవారం తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మోదీ పాలన కోసం ఖమ్మంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మంగళవారం నాడు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మండలంలోని మల్లవరం, బాలపేట, అన్నారుగూడెం, బిల్లుపాడు, వెంగన్నపేట గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చావా కిరణ్, మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, ఎల్లంకి సుధాకర్, తాండ్ర వినీత్‌రావు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం..

కారేపల్లి: బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపును కాంక్షిస్తూ సోమవారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ.. కమలంపువ్వు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దమ్మ పుల్లయ్య, అక్కుల సురేష్, తురక కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

పెనుబల్లి: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి సూచించారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. త్యాగాల కోట భువనగిరిలో ఎర్ర జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, మండల



మాట్లాడుతున్న భారతి

కార్యదర్శి గాయం తిరుపతిరావు, కండె సత్యం, భుక్యా ప్రసాద్, గుడిమెట్ల బాబు, కండె సత్యం తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండ రామాలయ, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు సురేష్ శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భూమిపూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఆలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గ్రామానికి చెందిన వంకాయలపాటి గోపయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు, కొల్లి వెంకటప్పయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు సుమారు 14 కుంటలను వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థలదాతలను గ్రామపెద్దలు అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మధిర: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి హెచ్.వీరబాబు అన్నారు. సోమవారం వంగవీడు గ్రామ పంచాయతీలో హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. నాలుగు హెల్త్ టీములు ఏర్పాటు చేసి ఇంటింటికీ ఆరోగ్య సర్వే నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ క్యాంపులో 44 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి టెస్ట్ కోసం ఖమ్మం పంపించడం జరిగింది. క్యాంపులో షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్ రావు, మరియరాణి, సీహెచ్ఓ సుభాషిని, ల్యాబ్ టెక్నీషియన్ పుతిలి భాయ్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, గ్రామ సెక్రెటరీ రాకేష్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు సత్యవాణి, రాజ్యలక్ష్మి, సరస్వతి, సుజాత ఝాన్సీ, ఆశా కార్యకర్తలు పద్మ, వెంకటమ్మ, దివ్య, అరుణకుమారి, సునీత పాల్గొన్నారు.

శాంతినిలయంలో అన్నదానం


దివ్యాంగులకు అన్నదానం నిర్వహిస్తున్న జై భీమ్ యూత్ కమిటీ సభ్యులు

బోనకల్: జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శాంతినిలయంలో సోమవారం మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జై భీమ్ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. కడు పేదరికంలో ఉన్నవారికి కడుపునిండా భోజనం పెట్టడమే జై భీమ్ యొక్క ఆశయమన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో తోటివారికి సహాయపడే గుణాన్ని అలవరుచుకోవాలన్నారు. మానసిక దివ్యాంగులకు సిస్టర్ ఆల్ఫీ చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

ముదిగొండ: భవన నిర్మాణరంగం కార్మికులు హక్కుల సాధనకు ఉద్యమించాలని భవన నిర్మాణరంగం జిల్లా కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో భవననిర్మాణరంగం ముదిగొండ మండల కమిటీ సమావేశం కన్నోజు ఈశ్వారాచారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కుల కాలరాసిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాసోజు లక్ష్మణాచారి, మండల కార్యదర్శి చెట్టిపోగు వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల కన్వీనర్ కల్యాణ్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


చెరువులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ముదిగొండ: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి సూచించారు. సోమవారం మండలంలోని న్యూలక్ష్మీపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. పనిప్రదేశంలో కల్పిస్తున్న మౌళిక వసతులపై ఆరా తీశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు త్వరగా పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శపాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మైత్రి, పంచాయతీ కార్యదర్శి రాంబాబులు పాల్గొన్నారు.

రైలులో సాధారణ బోగీలు పెంచాలి

కారేపల్లి: రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలని.. ప్రధాన మంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టినట్లు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, సామాజిక కార్యకర్త పరికపండ్ల అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని కమలాపురం గ్రామంలో కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగంగా.. ప్రజలకు అవగహన కల్పిస్తు ప్రదర్శన నిర్వహించారు. ఈ సదర్బంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 30కోట్ల మంది ప్రజలు రైళ్ల ద్వారా ప్రయాణాలు కొనసాగిస్తున్నారని, ఈ ప్రయాణాల్లో సాధారణ బోగీల్లో ప్రయాణించే సామాన్య ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. బోగీల్లో కుక్కి కుక్కి ప్రయాణించాల్సి వస్తుందని, ఈ క్రమంలో చిన్నారులు, వృద్ధులు, మహిళల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందన్నారు. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా బావించి 'టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్‌బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ – 110011' చిరునామాకు మీ అభిప్రాయాన్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9989310141 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ బేతి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు వడ్డె సీతారామయ్య, కొదుమూరి పుల్లయ్య, వీరభద్రయ్య, ప్రమీల, నాగయ్య, రాములు, శీనయ్య, లక్ష్మి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తరాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్తులు

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ

కల్లూరురూరల్: మండలంలోని రఘునాథగూడెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ కోండడ స్వామి, బోడ్రాయి(నిభిశిల) దేవతా విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. ఆంధ్రాలోని ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన కాసులనాటి పద్మనాభ శర్మ ఆధ్వర్యంలో పండితులు, పురోహితులు గోపూజ, విఘ్నేశ్వర పూజ, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని పూజలు నిర్వహించి.. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రామారావు, ఆలయ కమిటీ సభ్యులు పెడకంటి రామకృష్ణ, చల్లగుండ్ల వెంకటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రఘునాథగూడెంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

నేడు తనికెళ్లలో రైతునేస్తం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షలు–భూమిలో సేంద్రీయ కర్బణం పెరుగుదల అనే అంశంపై శాస్త్రవేత్తలు రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారని రైతులు అధిక సంఖ్యలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొణిజర్ల ఏఓ డి.బాలాజీ కోరారు.

కూలీలకు వడదెబ్బపై అవగాహన

కల్లూరు: మండలంలోని లక్ష్మాతండాలో ఉపాధిహామీ కూలీలకు సోమవారం కల్లూరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి నవ్యకాంత్ ఆదేశాల మేరకు ఆస్పత్రి సిబ్బంది వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సూపర్ వైజర్ గుండపనేని రామారావు మాట్లాడుతూ. వడదెబ్బ తగిలిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వెంట తాగునీరు తీసుకెళ్లాలని, ఉప్పు, పంచదార కలిపిన నీరు, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తదితర ద్రావణాలు తీసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని, జ్వరం, వాంతులు, విరోచనాలు, తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నిర్మల, పద్మ, పంచాయితీ కార్యదర్శి హరీష్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

'ఉపాధి'కి ఊతం..!

జోరందుకున్న ఉపాధిహామీ పనులు

- పంటకాలువలే ప్రాధాన్యంగా పనులు
- కూలీ రేట్లు పెంచడంతో మరింత ఉత్సాహం
- మహిళలే అధికంగా హాజరవుతున్న వైనం
- రోజుకు రూ.300 కూలి వచ్చేలా అధికారుల కృషి


న్యూలక్ష్మీపురంలో పంటకాలువ పనుల్లో నిమగ్నమైన కూలీలు

ముదిగొండ: జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీకి 365 రోజులు పని కల్పించడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఈనేపథ్యాన మధిర నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొదలైన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండుటెండలను లెక్కచేయకుండా కూలీలు పనులు చేస్తుండగా.. మహిళలే అధిక మొత్తంలో హాజరవుతున్నారు. ఎప్పటికప్పుడు మస్టర్లు, కొలతలు వేసి బిల్లులు జమచేస్తున్నారు. రోజుకు రూ.300 వరకు కూలి వచ్చేలా కూలీలు పనులు చేస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా కూలీలు..

మధిర నియోజకవర్గంలో ప్రతీ రోజు ముదిగొండ మండలంలో 2,990, బోనకల్ మండలంలో 3,777మంది, చింతకాని మండలంలో 3,416మంది, ఎర్రుపాలెం మండలంలో 4,665మంది, మధిర మండలంలో 3,240మంది వివిధ పనులకు హాజరవుతున్నారు. ఈనేపథ్యాన ముదిగొండ మండలంలో 25 గ్రామపంచాయతీల నుంచి రోజుకు 2,990 మంది కూలీలు పంట కాలువల పూడికతీత, చెరువుల్లో పనులకు హాజరవుతుండగా, దాదాపు 1,800 మంది మహిళలు ఉండడం విశేషం. అయితే రైతులు కూడా జాబ్‌కార్డు ద్వారా తమ పంట కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించుకుంటున్నారు. పని ప్రదేశంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యాన నీడ పట్టాలు, మంచినీటి సౌకర్యం కల్పించడం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు.

ఆర్థికంగా తోడ్పాటు..

గతంలో కేంద్ర ప్రభుత్వం కూలీలకు తట్ట, బుట్ట, పార, గడ్డపార, మంచినీళ్లకు మొత్తం కలిపి రూ.30లు రోజువారి వేతనంలో జమ చేయగా.. ఇప్పుడు అలా జమకావడం లేదు. రోజుకు కనీస వేతనంగా రూ.300 ఇవ్వాలనే ఉద్దేశంతో అధికారులు కృషి చేస్తున్నారు. కూలీలకు అవగాహన కల్పిస్తుండడంతో రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతోంది. దీంతో పనితో పాటు ఆర్థికంగా తోడ్పాటు అందుతోంది.

పనులకు రోజు వెళ్తాం..



ప్రతీ రోజు ఉపాధి పనులకు వెళ్తున్నాం. మహిళలందరూ జట్టుకట్టి పోటీగా పని చేస్తాం. టీంల వారిగా పంట కాలువల పని, చెరువుల్లో పూడికతీత వంటి పని చేస్తున్నాం. 100 రోజులు పని పూర్తి చేశా.

– ఎం.విక్టోరియా, కూలీ, న్యూలక్ష్మీపురం

బిల్లులు చెల్లించాలి..



గత ఏడాది చేసిన వందరోజుల పనికి వేతనాలు అందాయి. మార్చి నుంచి చేస్తున్న ఐదు వారాల బిల్లులు ఇంకా చెల్లించ లేదు. దీంతో పనులు చేయాలంటే కాస్త వెనకడుగు వేయాల్సి వస్తుంది. ఇకనైనా బిల్లులు త్వరగా చెల్లించేలా చూడాలి.

– బట్టు స్వప్న, కూలీ, న్యూలక్ష్మీపురం

ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం..



జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరూ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి పనికి కావాల్సిన పత్రాలు అందిస్తే వెంటనే పని కల్పిస్తాం. కొలతలు, మస్టర్ల ప్రకారం బిల్లులు వెంటనే అందజేస్తాం. ఇప్పటికే చెరువుల పనులు మొదలయ్యాయి.

– రంగనాయకమ్మ, ఏపీఎం, ముదిగొండ